క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, ప్రమాదాలు నివారించాలని ఎస్ఐ ఎం కేశవ సూచించారు. మండల పరిధిలోని దుద్యాల గ్రామ శివారురులో ఆదివారం ఎస్ఐ వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని, సరైన ధ్రువపత్రాలులేని వాహనచోదకులకు జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాల మూలంగా జరిగే నష్టాలను వాహనచోదకులకు వివరించారు. హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని, ద్విచక్ర వాహనచోదకులు తప్పవనిసరిగా ధరించాలని ఎస్ఐ సూచించారు.

కొనసాగుతున్న భక్తజన సందడి

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రతదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీకామేశ్వరిదేవి, శ్రీమహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామిఅమ్మ వారికి అభిషేకం, కుంకుమార్చన, అష్టవిధ మహామంగళహారతులు, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన గోపినాథ్

మిడుతూరు : నందికొట్కూరు– నంద్యాల రహదారిలోని వివనగండ్ల బాట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు నందికొట్కూరు పట్టణానికి చెందిన యువకుడు గోపీనాథ్ ద్విచక్ర వాహనంపై మిడుతూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వీపనగండ్ల బాట సమీపంలోని గోడౌన్ వద్ద మోటార్ బైకు అదుపు తప్పడంతో కింద పడ్డాడు. నందికొట్కూరు పట్టణం నుంచి వస్తున్న ఎస్ ఓబులేసు ప్రమాదం జరిగిన ఘటన చూసి 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా కొవ్వొత్తుల ఆరాధన



కొవ్వొత్తుల ఆరాధనలో పాల్గొన్న భక్తులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ఆరాధన పండుగను ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి సిఎస్ఐ ప్రాస్టేట్ సంఘ చైర్మన్ భరత్ కుమార్ బాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

మహానంది: మండల కేంద్రమైన తిమ్మాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు. కృష్ణనంది ఫీడర్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, అబ్బీపురం ఫీడర్‌లో ఉదయం మూడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు, పుట్టుపల్లె ఫీడర్‌లో ఉదయం మూడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు గమనించాలన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు: జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కిసాన్ మహాసభ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో నాయకులు పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంఒ ఇచ్చిన ఇంటి స్థలంలో గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్న ప్రజలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలైట్లు లేక ప్రజలు చీకటి పడితే బయటకు రాలేని పరిస్థితి దాపరించిందని వాపోయారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు బీబీ, షేక్షావలి, హుసేన్‌బాషా, స్వాములు, నాయుడు, మాబాషా, అలీమ్, వెంకటరమణ, గోపాలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూటీఎఫ్ పని చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శులు రామమోహన్ పాల్గొన్నారు.

పొలంలో నిప్పు.. తప్పదు ముప్పు!

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల ఆలోచనలు
- పొలంలో కలియదున్నితేనే మేలు



వరి కోత అనంతరం పంట అవశేషాలకు నిప్పు పెట్టన దృశ్యం



రబీ కోసం సాగు చేసిన వరి నారు

బండిఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండింది. నెల రోజులుగా యంత్రాల ద్వారా కోతలు, నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే పొలంలో రబీలో మరో పంట వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. పాడి పశువులు ఉన్న రైతులు అయితే వరి గడ్డిని ఇంటికి వివిధ రూపాల్లో రవాణా చేస్తున్నారు. కానీ పాడి లేని రైతులు వరి చేను వ్యర్థాల(గడ్డి)కి పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. రైతులు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారాన్ని నాశనం చేస్తున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

యంత్రాలతో కోతలు జరిగిన పొలాల్లోనే..

మండలపరిధిలో మొత్తం 27 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వరి చేనులో కోతలు కోసిన రైతులు పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాల ద్వారా వరిచేను కోత కోసిన తర్వాత ధాన్యం ఇంటికి చేరుకోగా పంట వ్యర్థాలు (గడ్డి) పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు వ్యర్థాలు(గడ్డి) లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒకచోటకు చేర్చి కుప్ప పెట్టాలంటే రైతులకు ఖర్చుతో కూడిన పని. దీంతో గడ్డికి నిప్పు పెట్టి రబీ పంటను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు అంతరించిపోతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర శిలీంద్రాలు అంతరించి పోవడం వలన భూమికి నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

మరోపంటకు ఇబ్బంది లేకుండా



వరిచేను యంత్రాలతో కోత కోసిన అనంతరం పొలంలో గడ్డి ఉండిపోతుంది. గడ్డి మట్టిలో కలిసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. మరోపంట వేసుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున గడ్డిని కాల్చేస్తున్నాం. తరువాత పొలాన్ని దుక్కి, దమ్ము చేసి రెండో పంట వేసుకుంటున్నాం.

– రాగాల రమణ రైతు, కడమల కాలువ

అవగాహన కల్పిస్తున్నాం

పొలంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెట్టడంవలన భూమి పొరల్లో ఉన్న శిలీంద్రాలు ఇతర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశించి పోతాయి. యంత్రాలతో కోత కోసిన తరువాత వ్యర్థాలను ఒక చోట చేర్చి అవి కుళ్లేలా చేయడం వలన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– స్వాతి, వ్యవసాయాధికారిణి

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



మైనర్లతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బొమ్మలసత్రం: మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన తనిఖీల అనంతరం సీఐ మాట్లాడుతూ 15 మంది మైనర్లను వాహనాలు నడుపుతుండగా గుర్తించామన్నారు. మైనర్లను స్టేషన్‌కు తీసుకువెళ్లి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులు అత్యుత్సాహంతో వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవటమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలను ముప్పులో పడేస్తున్నారని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వసిస్తున్నట్లు చెప్పారు. బైక్ మీద వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని, మొబైల్ లో మాట్లాడుతూ వాహనాలు నడపటం మంచిదికాదని సూచించారు.

క్రిస్మస్ సందర్భంగా కబడ్డీ పోటీలు



భాస్కరాపురంలో కబడ్డీ క్రీడల పోస్టర్లు విడుదల చేస్తున్న ఏబీఎం చర్చి సంఘం పెద్దలు

జూపాడుబంగ్లా: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని భాస్కరాపురం, తంగడంచ గ్రామాల్లో కబడ్డీపోటీలు నిర్వహించనున్నట్లు ఏబీఎం, సీఎస్ఐ చర్చీల సంఘం పెద్దలు తెలిపారు. భాస్కరాపురం గ్రామంలో ఈనెల 24తేదీ నుంచి 26వరకు మూడు రోజులపాటు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.50వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 9701030603, 9642403482 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

తంగడంచ గ్రామంలో...

తంగడంచ గ్రామంలో ఈనెల 24న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు. విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.3వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి క్రీడాకారులు 8310861934, 8688570321 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

26న పారుమంచాలలో...

మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో ఈనెల 26న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు పారుమంచాల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆర్ సీఎం చర్చి సంఘం పెద్దలు తెలిపారు. విజేత జట్లకు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి క్రీడాకారులు 9849795625, 9963996065 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

80బన్నూరులో...

మండల పరిధలోని 80బన్నూరులో 26న ఉదయం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఏబీఎం చర్చి సంఘం పెద్దలు తెలిపారు. విజేత జట్లకు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి క్రీడాకారులు 6281427441, 9177183780 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు.

క్రిస్మస్ సందడి



దుకాణంలో విక్రయానికి వుంచిన అలంకరణ సామగ్రి

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం క్రిస్మస్ సందడి కనిపించింది. పట్టణంలోని ప్రధాన బాజార్లు కప్పలకుంట్ల, గౌడ్‌సెంటర్, పాత బస్టాండు ఏరియాలో దుకాణాల వద్ద నిత్యావసర సరుకులతోపాటు క్రిస్మస్ స్టార్‌లు, సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తూ కనిపించారు. అలాగే గృహ అలంకరణ, చెప్పులు, ఫ్యాన్సీ దుకాణాలు కిటకిటలాడాయి. ఇప్పటికే కొందరు క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు, రంగురంగుల విద్యుత్ దీపాలతో గృహాలను కూడా అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు. మార్కెట్‌లో చిన్నస్టార్‌లు రూ.50 నుంచి రూ.300, పెద్ద స్టార్‌లు, ట్రీలు రూ.500 నుంచి రూ.1000 దాకా వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది అత్యధికంగా అలంకరణ బల్బులకు డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పండుగ సందర్భంగా పూలకు డిమాండ్ పెరిగింది. మూర మల్లెలు రూ.30 నుంచి రూ.50 దాకా విక్రయిస్తున్నారు.

పంటల బీమా చేయించుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: రబీలో సాగుచేసిన పంటలకు డిసెంబర్ 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని బోయరేవుల, వెలుగోడు గ్రామాలలో వరి నారుమడులను ఏఓ పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న చోట రైతులు రబీ వరిసాగుకు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికే వరి నారుమడులు పోసుకొని, కొన్ని ప్రాంతాల్లో నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్నారన్నారు. అయితే రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని, ఈ ప్రభావం వరినారుమడులపై పడే అవకాశం ఉందన్నారు. చల్లగాలులు, మంచు నుంచి నారును సంరక్షించుకుంటే ఆరోగ్యంగా పెరిగి సకాలంలో చేతికి వస్తుందని చెప్పారు. నారుమడి పోసేటప్పటి నుంచి ప్రధాన పొలంలో నారు నాటే వరకు రైతులు తగిన మెలకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, రామకష్ణ, రైతులు వీరభద్రుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

నంద్యాలలో కార్డెన్ సెర్చ్



సీజ్ చేసిన వాహనాల వద్ద పోలీసులు

బొమ్మలసత్రం: పట్టణంలోని విశ్వనగర్ కాలనీలో ఆదివారం వేకువజామున సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 13 వాహనాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అదుపు చేసేందుకు ముందస్తుగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టామన్నారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం



మాట్లాడుతున్న చల్లా జయశంకర్‌రెడ్డి

పాములపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యశించే విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందజేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి చల్లా జయశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులను ప్రాత్సహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి రూ. 15వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పాఠశాల అభ్యున్నతికి ప్రతి పూర్వ విద్యార్థి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటేశ్వరరావు, దేవభూషణం, ఇస్మాయిల్, పుల్లయ్య, శ్రీనివాసులు, మౌలావుశేన్, సాయిక్రిష్ణ, నాగేశేషన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్

ఆత్మకూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బీసీల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మన్యం బాలస్వామి యాదవ్ మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం అత్యధిక శాతం కలిగిన బీసీలకు కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవులను బీసీలకు అత్యధిక శాతం కేటాయించాలని, ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్‌యార్డు చైర్మన్ గత ప్రభుత్వం బీసీలకు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం కూడా బీసీలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆత్మకూరు పట్టణంలో బీసీ భవన్‌కు స్థలం కేటాయించి, భవనం నిర్మించి ఇవ్వాలన్నారు.

బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్) : వేసవి సెలవుల్లో నిర్వహించే బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి శివయ్య కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే 31న కటాఫ్ తేదీ తీసుకోవడం వల్ల 2023 జూన్ నెలలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు అవకాశం ఉండదని, దీని వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఖాళీగా ఉన్న స్థానాలను దృష్టిలో ఉంచుకొని సీనియర్లకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, రంగనాయకులు, తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాలల ఆశాజ్యోతి పీవీ రావు



పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: దివంగత పీవీ రావు మాలల ఆశాజ్యోతి, ఆయన చేసిన సేవలు మరవలేనివని మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు అచ్చుగట్ల నాగేష్ పేర్కొన్నారు. పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆదివారం మాలమహానాడు వ్యవస్థాపకుడు దివంగత పీవీ రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. చంద్రబాబు అంతం... మాలల పంతం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అచ్చుగట్ల నాగేష్ మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడి విజయం సాధించిన మహనీయుడు పీవీ రావు అని కొనియాడారు. మాల మాదిగలను విడదీసేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, బాబు కుతంత్రాలను తిప్పికొట్టేందుకు మాలలు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, వేల్పుల సుంకన్న, వెంకటస్వామి, బెంటిక్, తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి

ఆత్మకూరు: దళిత సామాజిక ఉద్యమనేత, మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు 19వ వర్ధంతి మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండులోని అంబేడ్కర్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు మల్లె ఎలీషా, శీలంశేషు, మురహరి మల్లయ్య, కేశవులు, గిరిజన సంఘం నాయకులు నాగేంద్ర, నరసింహానాయక్, సురేష్, చంటన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాగవిష్ణు విజయ్ గణితశాస్త్రానికి రామానుజన్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఆదివారం సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డా.పి.హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు బి.నరేంద్రనాద్‌రెడ్డి, డా.ఎం.బుచ్చయ్య, డా.ఎస్.శివనాగిరెడ్డి, ఎస్.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట



శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామం కాశిరెడ్డి ఆశ్రమంలోని బృందావన క్షేత్రంలో ఆదివారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహదాతలు సందీప్‌కుమార్‌రెడ్డి, అంజలి దంపతులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, జంగం సంజమ్మ, బొందెలి భవాన్‌సింగ్, గని ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

యువతతోనే నవ సమాజ నిర్మాణం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రీన్‌సొసైటీ సభ్యులు

నంద్యాల (వ్యవసాయం): దేశభవిత యువత చేతిలో ఉందని, సామాజిక స్పృహ,సేవాభావంతో యువత సమాజ పురోగతికి తోడ్పడాలని గ్రీన్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఏపీ హోటల్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిధి కోరారు. ఆదివారం పట్టణంలోని మూలమఠంలోని భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో గ్రీన్ సొసైటీ దశమ వార్షికోత్సవాన్ని అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా రఘువీర్, దండు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పర్యావరణం, సామాజికసేవపై దృష్టి సారించాలన్నారు. నంద్యాల పట్టణం, పరిసర గ్రామాల్లో దశాబ్దకాలంగా విద్యార్థుల్లో నైతికవిలువలు, దేశభక్తిని పెంచే వివిధ పోటీలు నిర్వహిస్తూ పర్యావరణ జాగృతిని పెంపొందిస్తున్నామన్నారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. మిద్దెతోటల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులందజేశారు. నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఉపాధ్యాయసంఘ నేతలు వీరబ్రహ్మం, శేషఫణి, శ్రీనివాసరెడ్డి, గంగులనాగరాజు పోసాశ్రీను, రామసుబ్బారెడ్డి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆక్రమించారు.. అమ్మేశారు!



రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించిన దుకాణాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో కర్నూలు–గుంటూరు రహదారిని ఆక్రమించుకొని యథేచ్ఛగా క్రమ, విక్రయాలు చేస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు 44.400 కిలో మీటరు నుంచి 44.800కిలో మీటరు వరకు ఎడమవైపు రహదారి స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా దుకాణం ఏర్పాటుకు 20చదరపు అడుగుల స్థలాన్ని రూ.60వేల నుంచి రూ.80వేల వరకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. అయినా అర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కేజీ రోడ్డు కుంచించుకుపోయి వాహనాల డ్రైవర్లు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణకు గురైన కేజీ రోడ్డు స్థలాలను ఖాళీచేయించి వాహనాల రాకపోకలకు, పాదాచారులకు ఇబ్బందుల్లేకుండా చేయాలని వాహనాల డ్రైవర్లు, పాదాచారులు కోరుతున్నారు.